# సెగకాలిన బాంధవ్యం

**— వి. ప్రతిమ**

సూర్యుడు రోడ్డున పడ్డాడు...ఎవరి నీడలు వారికిందే నలుగుతోన్న సమయం. చెట్లు వూపిరి పీల్చుకోడం మర్చిపోయి గాలిని దిగ్బంధించినట్లుగా వుంది. ఆ నిరాసక్తమయిన నిశ్శబ్దంలో దూరం నుంచి వేగంగా వస్తోన్న బస్సు హారను ధ్వని ఆగకుండా కర్ణకఠోరంగా వినిపిస్తోంది. ఆ బస్సు వెళ్తూ వెళ్తూ ఆ మట్టి రోడ్డు మీది దుమ్ము నంతటినీ పక్కనున్న చింతమాన్ల మీద వెదజల్లి పోయింది.

గుడిసె ముందున్న చింతచెట్టు కింద గొంతు క్కూర్చుని బితుకు బితుకు మంటూ రోడ్డుకేసి చూస్తోంది నీలి. సూర్యుడి నియంతృత్వానికి భయ పడి నిర్మానుష్యంగా వున్న ఆ ప్రాంతం ఆ పిల్ల కళ్ళల్లోని శూన్యానికి ప్రతీకలా వుంది. నీలి ఒంటిమీద నల్లగా మాసిన గౌను చిరిగి చిరిగి యిక చిరగడానికి చోటు లేనట్లు దీనంగా వేళ్ళాడుతోంది.






"అమ్మింకా రాలేదే" అప్పటికిది వెయ్యోసారి నీలి పెదవులలో కదలడం—"అమ్మేం తెస్తదో" ఈసారి పైకే అన్నది. అవును నీలి పొద్దుట్నుంచీ పచ్చి మంచినీళ్ళు కూడ తాగలేదు.

తల్లి పనిలోకి వెళ్ళేప్పుడు మెలకువగానే వున్నా నీలి లేవదు.

నీలి నిద్ర లేవదు. యింకా యింకా నిద్ర పోవా లనే చూస్తుంది. కానీ నిద్ర పట్టదు. రోజంతా ముడుచుకు పడుకోవడంతో నిద్ర పట్టదా పిల్లకి సవ్యంగా. మరీ తప్పదన్నపుడు యిక లేచి నీళ్ళ తోనన్నా కడుపు నింపుకుందామని పంపు దగ్గరకి వెళ్ళేసరికి యిక నీళ్ళాగిపోతాయి. అసలే ఎండా కాలం కావడంతో ఒక గంట మాత్రమే వదులు తున్నారు నీళ్ళు.

అదీ అరమైలు దూరం నడిస్తేగాని రాదా పంపు. అక్కడ్నుంచి రెండు బిందెలు నీళ్ళు తెచ్చు కున్నా నీలి అడిగితే ఒక్క చుక్క మంచి నీళ్ళివ్వ టానికెవ్వడ సాహసించలేదెవరూ. అందుకే నీలి పొద్దుట్నుంచీ పచ్చి మంచినీళ్ళు కూడ ముట్టలేదు.

ఆకలితో నకనకలాడుతూ చుమ్మలు చుట్టుకు పోతోంది నీలి కడుపు.

దానికి తోడు నర్రున మాడుస్తోన్న ఎండొకటి. గుడిసెలో కూర్చుందామంటే వీథి చివర అమ్మ వస్తూంటే కనపడదు. అందుకే చింత చెట్టు కింద కూర్చుని అమ్మకోసం చూస్తోంది. ఆకలికీ, ఎండకీ పిచ్చెక్కుతోందా పిల్లకి.

అప్పడప్పుడూ అటు ఇటు వెళ్తోన్న మనుషుల వంక ఆశగా చూస్తోంది. కానీ వాళ్ళు ఆ పిల్ల వంక చూడనైనా చూడకుండా వెళ్తున్నారు.

"అమ్మింకా రాలేదేమి?" మళ్ళీ అనుకుంది నీలి.

"రెడ్డోరింట్లో పని జాస్తి...ఈ యాళకి యింకా గుడ్డలుతకతా వుందుంటది. గుడ్డలవతానే రెడ్డెమ్మ యిచ్చిన సద్దన్నం తీసుకుని వచ్చేస్తుంది"

...అల్లదిగో వత్తన్నట్టుందే...ఛీ కాదు పక్క గుడిసె నర్సమ్మ.

"అమ్మ కూడ రావలనే యియ్యాల్టికి" పదే పదే అనుకుంటోంది. నరసమ్మ గున గునా నడు చుకుంటూ వచ్చి పక్క గుడి సెలోకి దూరింది. కాస్సేపటికే నర్సమ్మ కొడుకు అప్పటిదాకా నిద్రపోతున్న ఆరేళ్ళవాడు చేతిలో 'వడ'ను కొరుకుతూ బయటికి వచ్చాడు. వాడు నడుస్తూ మెల్లిగా వచ్చి నీలి పక్కనే కూర్చున్నాడు. నీలి ఆశగా వాడి చేతి వంక చూసింది.

నీలి లాలాజల గ్రంథులు పనిచేయడం మొదలుపెట్టాయి. కొంచెం పెడ్తాడేమోనని కొండడి వంక ఆశగా చూసింది. వాడు రోడ్డువంక చూస్తూ మధ్య మధ్యన చూసీ చూడనట్లుగా నీలికేసి చూస్తూ ఆ పిల్లకి చూపించి వూరిస్తూ తింటున్నాడు.

"రేయ్ కొండా నాక్కొంచెం బెట్టరా...మాయమ్మ యేమైనా తెస్తే నీకు బెట్టాలేరా" రాత్రి గూడ ఏం తిన్లేదురా" దీనంగా అడిగింది నీలి బుల్లి చేతిని కొండడి ముందు చాపుతూ.

"అమ్మో నాగ్గావాలా" చేతిని వెనక్కి లాక్కుంటూ చెప్పాడు వాడు. చెప్పి త్వరత్వరగా తినసాగాడు వాడు.

"కొంచెం బెట్టురా...మాయమ్మ ఏం దెచ్చినా నీకు బెట్టానా" మళ్ళీ బ్రతిమాలింది.

కొండడు ఆ 'వడ'ను గబగబా నోట్లో కుక్కేసుకుని చేతి కంటిన నూనెను రెండు చేతుల్తోనూ తాటించాడు.అంతటితో ఆగక అయిపోయిందన్నట్లు ఎగతాళిగా చేతులు తిప్పాడు.

నీలి కళ్ళల్లో నీళ్ళూరాయి...నోట్లోనూ నీళ్ళూరాయి.

అసహాయతతో ఉక్రోషం అంత ఆకలిలో కూడ.

"మాయమ్మ దెస్తే నీకేమన్నా బెద్తానేమో జూడయ్యా" అంటూ తర్జని చూపించి బెదిరించింది... అలా బెదిరించేప్పుడు నీటితో నిండిన నీలి కళ్ళు తళుక్కున మెరిశాయి.

నీలి అందంగా వుంటుంది. కొంచెం రంగు తక్కువేగాని పొట్ట లావుగా...కాళ్ళూ చేతులూ పీలగా, పీలికలైన గౌను చాటున దాక్కోలేక తొంగి చూస్తుంటాయి.

అన్నం వాసన...వాసనతో నీలి కడుపులో నరాలు మెలితిరిగాయి.

మంటలు...మంటలు...కడుపంతా మంటలు. నర్సమ్మ కాబోలు అన్నం వండుతోంది.

నర్సమ్మ వోళ్ళు రోజూ అన్నం తింటారు. తమలాగా ఒకరోజు తింటే రెండ్రోజులు పస్తులుండరు. నర్సమ్మ మొగుడు నాన్నలాగా తాగడు. రిచ్చాతొక్కిన డబ్బులు నర్సమ్మ చేతికే యిస్తాడు. నర్సమ్మ కూడ రెండిళ్ళల్లో పాచిపని చేస్తుంది. కూతుర్ని ఆడెద్నో పట్నంలో రెడ్డోరి కూతురింట్లో బెట్టిందంట. దాని వైభోగం అంతా యింతా కాదని చెప్తుంటది నర్సమ్మ. తన్ను కూడ ఏడైనా పెడ్తానంటే తనే అమ్మనొదిలి బోనని యేడ్చింది.

"అమ్మింకా రాలేదేమి? అదిగో వస్తాంది...అమ్మ వస్తాంది" సంతోషాతిశయంతో చప్పట్లు చరుస్తూ లేచింది నీలి.

నల్లటి తారు రోడ్డు మీద కాలుతోన్న కాళ్ళకన్నా కడుపు యింకా దారుణంగా మాడుతోంటే చకచకా అడుగులు వేసుకుంటూ వచ్చి కూతుర్ని పట్టించుకోనట్లుగా వొంగి గుడిసెలోకి దూరింది అంకమ్మ.

"యామే నీలీ...బానలో ఒక్క చుక్క నీళ్ళు లేవేమే నీళ్ళు పట్టలే?" ప్రశ్నించింది కూతుర్ని.

"లేదే నాన్లెగిసేప్పటికే నీళ్ళు పోయినయి" తల్లి చేతుల వంక ఆశగా జూస్తూ ఉత్సాహంగా చేయి జాపి ఆ గిన్నెను లాక్కోబోయింది నీలి.

కుడిచేత్తో ఒక్క తోపు తోసింది అంకమ్మ.

"యెంత సేపు తిండి రంధేనే నీకు...కుండకు నీళ్ళు బట్టుకుంటే ఏమే? గుడిసె చిమ్ముకుంటే యేమి? గాడా నీకు. పనికి సరే బోనంటివి. యింట్లోనన్నా ఏదైనా చేసుకుంటే ఏమే?" రంకెలేస్తోంది అంకమ్మ.

ఈసారి నీలి గుండెల్లో నీళ్ళూరాయి. అమ్మతోసిన తోపుకి కిందపడ్డ శరీరం అదిరింది. పొద్దుట్నుంచీ దహించేస్తోన్న ఆకలి మంట తల్లి చేసిన పరాభవంతో ఒకింత చల్లారినట్లయింది.

"ఏం కష్టిం చెప్ప నీళ్ళు బట్టుకుంటే...ఆ వయసుకి నేనెంత పన్జేసేదాన్ని. ఇంకా నాకుండాది ఓపిక! ఎల్లకాలం యింటింటి కాడా రెక్కలు ముక్కలు జేసుకోవాలంటే నావల్ల మాత్రం అవతాదా? మీ నాయినకి ఏమీ కాబట్టకపోయె" సణుగుతూనే కూతురికి, తనకీ గిన్నెల్లో తను తెచ్చిన సద్దెన్నం వడ్డించింది.

"రాయే నీలి తిను" పిల్చింది కూతుర్ని.

నీలి గుండెల్లో నీటి చెమ్మ. కూర్చున్న చోటు నుండి లేవలేదు నీలి.

"ఓయబ్బో మన బతుకుల కియి గూడానా... లేచి రాయే...ఇదిగో రాకపోయినావంటే యిది గూడ నేనేదినేస్తా" అంటూ తర్జని చూపించి బెదిరించింది అంకమ్మ...నిజంగానే అది కూడ తినేసేలా వుందామె ధోరణి.

ఇంక బెట్టు చూపించకుండా లేచి గిన్నె ముందు కూర్చుంది నీలి. రెండు నిముషాల్లో ఖాళీ చేసేసిందా కంచాన్ని.

"ఇంకొంచెం బెట్టే" అంది తల్లి గిన్నెలోకి చూస్తూ.

కోపంగా అరిచింది అంకమ్మ.

"తినే యిది గూడ తినేయ్...నీ కడుపులో రాక్షసుడు గన వుండాడేందే?" కూతుర్ని మళ్ళీ వెనక్కో తోపు తోసి తన గిన్నెను కూడ దాని ముందుకు నెట్టింది అంకమ్మ.

భయంగా అమ్మ వంకోసారి చూసి మెల్లిగా ఆ గిన్నెను లాక్కుని తినసాగింది నీలి. ఆ దృశ్యం చూసి కోపంతో వూగిపోయింది అంకమ్మ. లేచి ఆ ఎంగిలి చేత్తోనే కూతుర్ని దబదబా బాదేస్తూ.

"గమ్మున యింట్లో కూర్చుమండే దానికి నీకే యింత ఆకలుంటే యింక రెడ్డోరింట్లో అటాకు చాకిరీ చేసేదానికి నాకెంత ఆకలుంటాదే లం...ముండా" అంటూ చేతి కొచ్చినట్టు ఎడాపెడా బాదేసి ఏడుస్తూ జుట్టు పీక్కోసాగింది అంకమ్మ.

భయంతో కంచాన్ని దూరంగా నెట్టి అక్కడ్నుండీ లేచి గుడిసెలో ఓ మూలగా వెళ్ళి ముడుచుక్కూర్చుంది నీలి...పేగులు కాల్చిన ఆకలి కన్నా తన శరీరం మీద తేలిన అమ్మ చేతి వాతలకన్నా నీలి మనస్సు చురుక్కున మండుతోంది...

అంకమ్మ ఏడుస్తోంది...బిడ్డను అన్నం తిన్నందుకు కొట్టి...బాగా చితగ్గొట్టి మళ్ళీ తనే ఏడుస్తోంది. ఆ ఏడుపు హృదయ విదారకంగా ఆ గుడిసెలో ప్రతిధ్వనిస్తోంది.

అమ్మ ఎందుకేడుస్తోందో నీలికర్థం కాలేదు. తనని యింతగా కొట్టి తిరిగి అమ్మే ఎందుకేడుస్తోందో అర్థంకాక నీలి కూడ ఏడుస్తోంది.

ఏదో శవం లేచినట్లుగా ఆ గుడిసె నిండా ఏడుపుల రోదన రాతి మేఘంలా కమ్ముకుంది. చాలాసేటికి అంకమ్మ తమాయించుకుంది.

"ఖర్మ,యిదంతా నా ఖర్మం. ఎదవ బతుకు...ఏ జల్మలో ఏం పాపం చేసుకున్నానో యిట్టాటోడికి పెళ్ళాన్నయినాను" సణుగుతూనే అన్నం గిన్నె చేతిలోకి తీసుకుంది...మెల్లిగా మూలనున్న కూతురి కేసి నడిచింది. ఏడుస్తూనే ముద్ద తీసి నోటికందించబోయింది.

భయం భయంగా చూసి వెనక్కి జరిగింది నీలి.

"తినే...తినమ్మా" బ్రతిమాలుతున్నట్లుగా చెప్పింది అంకమ్మ. చేతులు జోడించింది నీలి.

"నాకొద్దే...ఇంకెప్పుడూ అన్నం పెట్టమని అడగనే...ఏడవబాకే" అంటూ బయటికి పరిగెత్తింది నీలి. తన చేతగాని తనానికి మళ్ళీ ఏడ్చింది అంకమ్మ. "నర్సత్తా...నర్సత్తా" పిలుస్తోంది నీలి.

"ఏమే నీలీ...మీయమ్మ రాలే యింకా?" గుడిసెలో నుండి తొంగి చూసింది నర్సమ్మ.

"నర్సత్తా..."

"ఏందే అట్టుండావు" చిత్రంగా చూసింది నర్సమ్మ నీలికేసి.

"నర్సత్తా నన్నేదయినా పనికిబెట్టే?"

"ఓయబ్బో అమ్మ నొదిలి ఎల్లనంటివి గదే?"

"కాదే యిప్పుడు నేను పెద్దదాన్నవలే...మాయమ్మకింకా యేడ ఓపికుండాది చెప్ప...మాయమ్మ చేసి పెట్టలేదే...నన్నేదయినా బెట్టు పనికి" బ్రతిమాలుతున్నట్లుగా చెప్పింది నీలి.

వింటోన్న అంకమ్మ గుండె నెవరో బ్లేడుతో ముక్కలు ముక్కలుగా చెక్కుతున్నట్లుగా అన్పించింది. దాంతో అంకమ్మ దుఃఖం మరింత ఎక్కువయింది...ఆ ఏడుపు దూరంగా వున్న శ్మశానంలోంచి ఏదో ప్రేతాత్మ అరుస్తున్నట్టుగా వుంది.

"కన్నబిడ్డకి యింత అన్నం పెట్టలేని యిటువంటి అనాగరికమైన మనుషుల్ని యింకెప్పుడూ ఎక్కడా పుట్టించకూడదనుకుంటూ క్రూరంగా నవ్వుతున్నాడు దేవుడు" అన్నట్లుగా హఠాత్తుగా ఆకాశం గర్జించ సాగింది.